క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం...

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

లేపాక్షి: లేపాక్షి మండలంలోని కోడిపల్లి, విభూతిపల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హాజరవుతారని పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీ వాయిదా

మడకశిర(అగళి): అగళిలో శుక్రవారం జరగాల్సిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

హోటళ్లలో తనిఖీలు



సీజ్ చేసిన సిలిండర్లు

హిందూపురం టౌన్: పట్టణంలోని హోటళ్లు, బేకరీలపై విజిలెన్స్, మున్సిపల్, పౌర సరఫరాల అధికారులు గురువారం సంయుక్తంగా శానిటేషన్ తనిఖీలు నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లోని అరవింద్ హోటల్, రైల్వే రోడ్డులోని స్వాగత్ హోటల్, పలు బేకరీల్లో నిబంధనలకు విరుద్ధంగా వంట గ్యాస్ వినియోగిస్తుండగా ఏడు సిలిండర్లను సీజ్ చేశారు. రూ.52,500 జరిమానా విధించారు. విజిలెన్స్ ఎస్‌ఐలు బాలకృష్ణయ్య, ఫణీంద్రనాథ్, ఏఓ వాసుప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటప్ప, వీఆర్‌ఓలు సుభాషిణి, డేవిడ్‌లు పాల్గొన్నారు.

క్షతగాత్రలకు పరామర్శ

మడకశిర: ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి మడకశిర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని పరామర్శించారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. మృతురాలు గీతమ్మ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖను ఆమె కోరారు.

జైన సముదాయ ప్రజల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జైనులు

హిందూపురం టౌన్: జైనుల పవిత్రస్థలమైన సమ్మద్ శిఖర్‌జీ క్షేత్రాన్ని ఝార్ఖండ్ ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా ప్రకటించడాన్ని నిరసిస్తూ జైన్ సంఘం సభ్యులు, సముదాయ ప్రజలు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఝార్ఖండ్ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగేంద్రకుమార్, బాబులాల్, చారుకీర్తి, చంద్రకీర్తి, దరనేంద్ర కుమార్, బ్రహ్మదేవ్ పాల్గొన్నారు.

ఆలయ పనులకు శ్రీకారం

చిలమత్తూరు: శెట్టిపల్లిలోని ఎస్సీకాలనీలో సల్లాపురమ్మ ఆలయాభివృద్ధి పనులను సర్పంచ్ చామంతి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి దంపతులు గురువారం ప్రారంభించారు. సొంత నిధులు రూ.2 లక్షలు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు.

మత్తుతో అనర్థాలు

మడకశిర: డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వినియోగంతో తలెత్తే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సెబ్ సీఐ భార్గవరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే డ్రగ్స్‌తో ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. డ్రగ్స్ వాడడం చట్టరీత్యా నేరమని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ సుజాత, ఎన్ఎస్ఎస్ పీఓ మంజునాథ్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

రొళ్ల: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని మడకశిర మలేరియ సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, సీఎచ్‌సీ వైద్యాధికారిణి సృజన పేర్కొన్నారు. సీహెచ్‌సీ ఆవరణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దోమతెర వినియోగించేలా, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రామారావు, ఎంపీహెచ్ఈఓ షమివుల్లా, కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపికకు 8న పోటీలు

హిందూపురం: అండర్-16 వాలీబాల్ జిల్లా జట్టు ఎంపికకు స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో హిందూపురంలోని వాసవి విన్నర్స్ స్కూల్ గ్రౌండ్‌లో 8న ఉదయం 9 గంటలకు పోటీలు జరగనున్నట్లు ఎస్ఎస్‌సీఏపీ సెక్రటరీ రామచంద్ర తెలిపారు. ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు.

ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం

- ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, మాలగుండ్ల శంకరనారాయణ





రామయ్యనహట్టి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గుడిబండ: ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రామయ్యనహట్టి గ్రామంలో గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 98 శాతానికి కిపైగా అమలు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పతకాలు అందజేసిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసినవారికే పథకాలు అందేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పాలన చిరకాలం కొనసాగేలా దీవించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ నాగభూషణం, ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచ్‌లు నరసమ్మ, యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మినారాయణ, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ సుశీల, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు రమేష్, పాండు, నాయకులు ఈరన్న, తిప్పేస్వామి, శివరాజ్, శివకుమార్, చిత్తప్ప, శ్రీరామప్ప, గిరిధర నటరాజ్, పుట్టలింగప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గోరంట్ల: పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. ప్రజాధరణ కోల్పోతున్న ప్రతి పక్ష పార్టీలు, వాటికి కొమ్ముకాస్తున్న పచ్చ మీడియా అసత్యాలను ప్రచారం చేస్తు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని నమ్మ వద్దని సూచించారు. మండలంలోని బూదిలి గ్రామ పంచాయతీ పరిధిలోని కాగానిపల్లి, చిన్నరప్పల్లి, గొల్లపల్లి, బూదిలి తండాలో బూదిలి సర్పంచ్ రామాంజినేయులు, గోరంట్ల మార్కెట్‌యార్డు అధ్యక్షుడు బూదిలి వేణుగోపాల్‌రెడ్డి నేతృత్వంలో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేశారన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకం పొందాలంటే పచ్చ చొక్కానైనా ధరించి ఉండాలి, లేదంటే జన్మభూమి కమిటీ సభ్యులకు కప్పమైనా కట్టాల్సి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ వ్యవస్థ ద్వారా కులమత రాజకీయలకు అతీతంగా అర్హులందరికీ వారి ఇంటి ముంగిటకే సంక్షేమపథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న పదికాలలపాటు సీఎంగా కొనసాగేలా ఆశీర్వదించాలన్నారు. అనంతరం కాగానిపల్లి గ్రామంలో రూ.13.5 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరిశంకరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, బూదిలి ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్తా, అరుణ్‌కుమార్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మా కుటుంబానికి వివిధ పథకాల కింద మా బ్యాంకు ఖాతాకు రూ.1,00,947 జమ అయ్యింది. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.4219, జగనన్న అమ్మఒడి కింద రూ.29000, వైఎస్సార్ చేయూత కింద రూ.37500, వైఎస్సార్ ఆసరా కింద రూ. 15274, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన తదితర పథకాల కింద లబ్ధి జరిగింది. వచ్చే ఎన్నికల్లో జగనన్ననే ఆశీర్వదిస్తాను. – లక్ష్మక్క, రామయ్యనహట్టి గ్రామం, గుడిబండ మండలం

అండగా ఉంటాం..



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల నా కుటుంబానికి వివిధ పథకాల ద్వారా దాదాపు రూ.1,61,928 మేర లబ్ధి చేకూరింది. కుటుంబ పోషణ సజావుగా సాగిపోతోంది. ప్రాణం ఉన్నతం వరకూ జగనన్న వెంటే ఉంటాం – సరస్వతి, లబ్ధిదారు, కాగానిపల్లి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

మడకశిర: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అదిస్తున్నామని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో నూతన పింఛన్ల వారోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా మడకశిర మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరైన 145మందికి, మడకశిర గ్రామీణ మండల పరిధిలో 287 మందికి ఎమ్మెల్యే తిప్పేస్వామి పింఛన్ మొత్తాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట తప్పకుండా ఏటా పింఛన్ల మొత్తాన్ని పెంచుతున్నారన్నారు. గత ఏడాది రూ.2,500 ఉండగా ఈ ఏడాది రూ.2,750 పంపిణీ చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా ఉండేదన్నారు. ఎవరైనా పింఛన్‌దారుడు చనిపోతే వారి స్థానంలో కొత్తవారికి మంజూరు చేసేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరవుతుందని తెలిపారు. అనర్హుల పింఛన్లను మాత్రమే తొలగిస్తున్నారని తెలిపారు. అర్హులు ఆందోళన చెందవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజగౌడ్, అనిత, కమిషనర్ ప్రభాకరరావు, ఎంపీడీఓ సోనిబాయి, ఏఓ నరసింహమూర్తి, వైస్ ఎంపీపీలు నరసింహమూర్తి, శ్రీరామరెడ్డి, కౌన్సిలర్లు నాగేంద్ర, విక్రమ్, అంజి, అన్సర్, లక్ష్మయ్య, బలరామ్, సుధాకర్‌నాయక్, శీన, రమేష్, సిద్ధప్ప, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎన్ క్రిష్ణమూర్తి, ఫక్ృద్దీన్, నాయకులు జయరాజు, మంజునాథ్, సత్యనారాయణరెడ్డి, జమ్మానిపల్లి మూర్తి పాల్గొన్నారు.

పురం ప్రజల సంక్షేమం పట్టని ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు: మాజీ సీఎం చంద్రబాబు నరరూపరాక్షసుడని, అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మండిపడ్డారు. చిలమత్తూరు ఆర్బీకేలో గురువారం నిర్వహించిన పింఛన్ వారోత్సవాల్లో ఆయన పాల్గొని కొత్తగా మంజూరైన 260 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు న్యాయం చేస్తుంటే పింఛన్లు తొలగిస్తున్నారని టీడీపీ నేతలు విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు సినిమాలపై ఉండే ప్రేమ ఓట్లు వేసి గెలిపించిన ప్రజలపై లేదన్నారు. కొండూరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణ బొత్తిగా కనిపించడమే మానేశాడని, ఈ విషయంపై ప్రజల తరపున పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. చంద్రబాబు అండ్ కో... అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ మండిపడ్డారు. పవన్ కూడా అదే దారిలో పయనిస్తూ ప్రజల నుండి విమర్శలు ఎదుర్కొంటున్నారన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, ఏపీఎం భారతి, వైస్ ఎంపీపీ బయప్ప, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సుధాకర్, సర్పంచ్‌లు తిరుమలేష్, సంధ్య, మురళి, సింగిల్ విండో జబీఉల్లా, సీనియర్ నాయకులు రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి,నాగరాజు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత:

మరుంపలిలో ఆత్మహత్యకు పాల్పడిన హరీష్ కుటుంబానికి ఎమ్మెల్సీ ఇక్బాల్ గురువారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు.

బెంగళూరు, అనంతపురం వెళ్లి పింఛన్ల అందజేత



బెంగళూరులో హనుమంతరాయప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమ



నరసింహమూర్తి కుటుంబ సభ్యురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అశ్వినిరాజ్

మడకశిరరూరల్: గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. అనారోగ్యకారణాలతో స్థానికంగా లేని లబ్ధిదారులకు వారు ఉన్న చోటుకు వెళ్లి అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మడకశిర మండలం బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు హనుమంతరాయప్ప అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్లు వీణ, ఉమ స్వంత ఖర్చులు పెట్టుకొని బెంగళూరుకు వెళ్లి హనుమంతరాయప్పకు రూ.2,750 పింఛన్ మొత్తాన్ని అందజేశారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని 27వ వార్డుకు చెందిన పింఛన్ దారుడు నరసింహమూర్తి కొన్ని రోజులుగా అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటీర్ అశ్విని రాజ్ తన సొంత ఖర్చులతో అనంతపురం వెళ్లి పింఛన్ సొమ్ము రూ.10వేలను లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నీలకంఠేశ్వర ఆలయంలో విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి పూజలు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న విశ్రాంత సీనియర్ జడ్జి శివశంకర్ కుటుంబసభ్యులు

మడకశిర రూరల్: నీలకంఠాపురంలో కొలువైన నీలకంఠేశ్వరస్వామి దేవాలయాన్ని గురువారం సాయంత్రం తమ్మేడేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్ తన కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నీలకంఠేశ్వర స్వామికి, ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. అనంతరం సన్మానించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఉన్నారు.

ఘనంగా పాంచ్‌బీబీ దర్గా గంధం



గంధాన్ని తీసుకువెళుతున్న ముతవల్లి అలీహుస్సేన్

పెనుకొండ: పట్టణంలోని పాంచ్‌బీబీ దర్గాలో గురువారం రాత్రి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం దర్గా ముతవల్లి అలీహుస్సేన్ తలపై గంధాన్ని ఉంచుకొని ఊరేగింపుగా దర్గాకు వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. మహిళలు అశేషంగా పాల్గొని అమ్మవార్లను భక్తి శ్రద్ధలతో కొలిచారు. దర్గా నిర్వాహకులు ఖాదర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పింఛన్ల పంపిణీ

రొళ్ల: మండల కేంద్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణంలో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

మడకశిరలో విజిలెన్స్ అధికారులు

మడకశిర: పన్నుల ఎగవేత తదితర వాటిపై తనిఖీ చేసేందుకు గురువారం ఉదయం విజిలెన్స్ అధికారులు నియోజకవర్గ కేంద్రానికి విచ్చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు దుకాణాలను బంద్ చేసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 3 గంటల వరకు అంగళ్లను తెరవలేదు. అధికారులు తిరుగు ప్రయాణం కాగా వ్యాపారులు తమ దుకాణాలను తెరిచారు.

జాతీయ సమైక్యత అవార్డు ప్రదానం



పోతుల రామకృష్ణారెడ్డికి అవార్డు అందించి సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: పెనుకొండలోని బాబాయ్య దర్గా అందించే జాతీయ సమైక్యత అవార్డును గోరంట్ల మండలం బాలన్నగారిపల్లి గ్రామానికి చెందిన మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి గురువారం అందుకున్నారు. పోతుల రామకృష్ణారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు అందించి సత్కరించారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, జాబిలి జాంద్‌బాషా, పెనుకొండ డీఎస్పీ హుసేన్‌పీరా పాల్గొన్నారు.

పూల విక్రయాలకు స్థలం చూపండి

హిందూపురం: పూల విక్రయాలకు స్థలం చూపాలని పూల విక్రయదారులు గురువారం పట్టణంలో ధర్నా చేపట్టారు. విక్రయదారుడు హిద్దు మాట్లాడుతూ ఏళ్ల నుంచి పూలవిక్రయాలు చేస్తున్న మార్కెట్ తొలగించిన తర్వాత రైతు శిక్షణ కేంద్రంలో తాత్కలిక దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్నారు. అయితే దుకాణాలు తొలగించాలని పశుసంవర్థ ఖాధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. తమకు వెంటనే సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యాపారులు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబివుల్లాను కలిశారు. కొత్త మార్కెట్ భవనంలోని సెల్లర్‌లో విక్రయాలకోసం శాశ్వతంగా స్థలాలు కేటాయించి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వృద్ధులకు పరుపుల అందజేత



వృద్ధులకు పరుపులు అందిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అందించిన పరుపులను మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ గురువారం వెంకటేశ్వర వృద్ధాశ్రమానికి అందజేశారు. గతనెల 21న సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ ఆ వృద్ధాశ్రమానికి వెళ్లి దుప్పట్లు అందజేశారు. తమకు పరుపులు కావాలని వృద్ధులు కోరగా ఎమ్మెల్సీ స్పందించి స్వంత ఖర్చులతో పరుపులు కొనుగోలు చేసి చైర్‌పర్సన్ ద్వారా అందజేశారు. కౌన్సిలర్ షేక్ రేష్మా బాను, కోఆప్షన్ మెంబర్ రహమత్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, ముస్తఫా, షరీఫ్ పాల్గొన్నారు.

ఫొటో ఓటరు జాబితా అందజేత



జాబితాను సబ్ కలెక్టర్‌కు అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ: పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని 261 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఫొటో ఓటర్ల జాబితాను గురువారం రాత్రి సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు తహసీల్దార్ స్వర్ణలత, ఎలక్షన్ డీటీ అశ్వర్థ నారాయణ అందజేశారు. జనవరి 5 నాటికి నియోజకవర్గంలో 1,12,977 మంది పురుషులు, 1,10,549 మంది స్త్రీ ఓటర్లు, ముగ్గురు థర్డ్ జెండర్ ఓటర్లు మొత్తం 2,23,529 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు.

తిరుమలదేవరపల్లిలో పొలంబడి

లేపాక్షి: తిరుమలదేవరపల్లి గ్రామంలోని రైతు శ్రీనివాసరెడ్డికి చెందిన మొక్కజొన్న పంటలో గురువారం మండల వ్యవసాయాధికారి శ్రీలత ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆకు కత్తిరింపు ప్రయోగం, మానవాళిపై పురుగుల మందుల ప్రభావాన్ని వివరించారు. ఏఈఓ పుష్పలత, వీఏఏ విజయకుమార్, రైతులు ఆనందరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లేపాక్షి: రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదులో భాగంగా మండలంలోని ఊటుకూరులో వరి పంటలను వ్యవసాయాధికారి విజయభారతి గురువారం పరిశీలించారు. వరినారు నాటే సమయంలో పాటించాల్సిన మెలకువలను వివరించారు.

ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు

పెనుకొండ రూరల్: మునిమడుగులో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు డాక్టర్ గిరిధర్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భారతి, సూపర్‌వైజర్ రంగమ్మ,హెల్త్ అసిస్టెంట్ మురళి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌ల అందజేత

మడకశిర రూరల్: ఏఆర్ రొప్పం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు ఆరుమందికి గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్ఎం రాజీవలోచన్, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

సంక్షిప్త సమాచారం

కుమారస్వామి కలలు నెరవేరవు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: బీజేపీతో జత కట్టి సీఎం అవుతానని మాజీ సీఎం కుమారస్వామి పగటి కలలు కంటున్నారని, చివరకు ఆయన ఎమ్మెల్యేగానే మిగిలి పోతారని ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఎద్దేవా చేశారు. రూ.1.50 కోట్లతో గుజ్జనడు-చిన్నమ్మనహళ్లి రోడ్డు పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. రూ 50 లక్షలతో నిర్మించిన మడివాళ మాచదేవ సముదాయ భవనాన్ని ప్రారంభించారు. మద్దె-స్వారమ్మన దేవాలయం రోడ్డు పనులకు భూమి పూజలు చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి మోగిస్తుందని, బీజేపీ 50 సీట్లకు పరిమితం అవుతుందన్నారు. జేడీఎస్ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

రొళ్ల: గ్రామాల్లో అర్హత కలిగిన వారికి సచివాలయాల ద్వారా పూర్తి స్థాయిలో సేవలు అందించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులు శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. గురువారం ఆయన సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద లబ్ధిదారుల ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. ఈఓఆర్డీ క్రిష్ణప్ప పాల్గొన్నారు.

వైకుంత రథం ఏర్పాటుకు విరాళం

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో చేపట్టిన వైకుంఠ రథం తయారీకి గోరంట్ల మేదర సంఘం రూ.50 వేల విరాళం ప్రకటించింది. అదే విధంగా గోరంట్ల పట్టణానికి చెందిన చిలమత్తూరు మండలం సోమగట్ట గ్రామానికి చెందిన సుబ్బిరెడ్డి, ఆయన కుమారుడు రామకృష్ణారెడ్డి రూ.20,116 విరాళం ప్రకటించారు. మేదర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు భాస్కర్ ,శంకరప్ప, నాగభూషణం, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

అమరాపురం: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు, స్త్రీ నిధి, సీఐఎఫ్‌లో తీసుకున్న రుణాలను సక్రమంగా వాయిదా పద్ధతిలో చెల్లించేలా చూడాలని మేనేజర్ పద్మావతి సూచించారు. పట్టణంలోని వైకేపీ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న దుకాణాలు, చేతి వృతులతో జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలన్నారు.

లేపాక్షి: లేపాక్షిలో అన్నదాన సత్రం నిర్మాణానికి బెంగళూరుకు చెందిన లేట్ సొంటి నంజుండప్ప, రామలక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు మురళీకృష్ణ, నారాయణమూర్తి, రామక్రిష్ణ, వేణుగోపాల్‌మూర్తి, రఘునాథమూర్తి రూ. 25 వేలు అందించారు. అదేవిధంగా మరి కొందరు విరాళాలు అందజేశారు.

సీబీఎస్ఈపై శిక్షణ

హిందూపురం టౌన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద మిలీనియం పాఠశాలలో సీబీఎస్ఈ పాఠశాల అఫిలియేషన్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. అసిస్టెంట్ ఏఎంఓ మహేంద్రరెడ్డి, విషయ నిపుణులు వినీత రెజీనా, సర్వేశ్వరి, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీబీఎస్ఈ పాఠశాలల అఫిలియేషన్, కరికులం, తరగతుల నిర్వహణ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.